క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్యులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీ సేవియర్ లూథరన్ చర్చ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానికులు, సంఘ సభ్యులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి బీపీ, సుగర్, ఈసీజీ, మహిళల సమస్యల పరీక్షలు నిర్వహించారు. చర్చ్ పాస్టర్ రెవరెండ్ లంకపల్లి జాకబ్ రాజు, ట్రెజరర్ నేతల శేఖర్, పి.సి.సి.సభ్యులు, కె.జాన్ సుధాకర్, కుండా విజయ్‌కుమార్, కోనాల కరుణ్ కుమార్, డాక్టర్ విజయ్, సిబ్బంది శివ, ఏఎన్ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంప్

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో సోమవారం నుంచి ఈ నెల 16 వరకు ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మమత చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఎల్లేటి మమత ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ షెల్టర్‌లోని నిరాశ్రయులకు ఆధార్ కార్డు నమోదు కోసం అధికారుల సహకారంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇతరులు కూడా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. బుచ్చిరాజుపాలెం పరిసర కాలనీలకు చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సమ్మెను జయప్రదం చేద్దాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మల్కాపురం: ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరగనున్న పారిశ్రామిక సమ్మెను కార్మిక లోకం జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు పెంటారావు పిలుపునిచ్చారు. 61వ వార్డు ఆర్‌కే పురంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సమ్మె పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ పాలన విధానాల వల్ల దేశంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. లాభాల్లో ఉన్న పరిశ్రమలను బడాబాబులకు అప్పగించాలన్న ఆలోచన వల్ల ఎంతో మంది కార్మికులు రోడ్డున పడుతున్నా బీజేపీ నేతలకు అర్థం కావడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వారికి కార్మికులు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో ఆదివారం బల్లల పండగ ఘనంగా జరిగింది. పైడిమాంబ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా పండగ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ 90వ వార్డు నాయకులు నమ్మి శ్రీను, చుక్కా ప్రసాదరెడ్డి పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఇటువంటి పండగల ద్వారా సంప్రదాయాలకు పెద్దపీట వేసినట్లవుతుందన్నారు. బల్లల పండగను ప్రతీ ఏటా రజకులంతా వేడుకగా జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. కుల సంఘ పెద్దలంతా కలిసి సమైక్యతను చాటేలా వేడుక జరుపుకున్నారు.

వాసవీ క్లబ్‌కు కొత్త కార్యవర్గం

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెంకు చెందిన వాసవీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా నున్నా గాంధీ గుప్తా, కార్యదర్శిగా గుడిమెట్ల కుమారస్వామి, కోశాధికారిగా నున్నా శ్రీరామ్మూర్తి ఎన్నికయ్యారు. డిస్ట్రిక్ట్ 201 ఏ గవర్నర్ వీవీ గుప్తా ప్రొసీడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించగా ఎ.సునీత సమక్షంలో ఎన్నికలు జరిగాయి. వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఉద్దగిరి కుమార గుప్తా, క్యాబినెట్ ట్రెజరర్ కట్టా సతీష్, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మా బడి.. చదువులమ్మ చల్లని ఒడి



ట్యాబ్‌ల ద్వారా చదువుతున్న విద్యార్థులు



- 'నాడు-నేడు'తో **రూపురేఖలు మారిన** హెచ్‌సీ వెంకటాపురం జెడ్పీ హైస్కూల్
- ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన
- ఐఎఫ్‌టీ ప్యానళ్లతో దృశ్య సహిత విద్య
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

జగనన్న సీఎం అయ్యాక ప్రభుత్వ పాఠశాలల తీరుతెన్నులు పూర్తిగా మారిపోయాయి. కార్పొరేట్ స్థాయి సదుపాయాలతో సర్కారీ బడులు వెలుగొందుతున్నాయి. వెనుకటి రోజుల్లో అరకొర సౌకర్యాలతో నడిచే ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయులే కాదు విద్యార్థులు కూడా ఉండేవారు కాదు. శిథిలమైన తరగతి గదులతో పిల్లలు భయం భయంగా బడికి వచ్చేవారు. అటువంటి స్థితి నుంచి అద్భుతమనిపించే స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను సీఎం వైఎస్ జగన్ తీర్చిదిద్దారు. కోట్లాది రూపాయలతో సరస్వతీ ప్రాంగణాలకు నూతన హంగులు అద్దుతున్నారు.

గోపాలపట్నం: హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో విధులు నిర్వర్తించేందుకు ఉపాధ్యాయులే ఇబ్బంది పడేవారు. ఇప్పుడా పాఠశాల ఎంతో అద్భుతంగా మారింది. తరగతి గదిలో విద్యార్థులకు బెంచీలు, 8వ తరగతి వారికి ట్యాబులు, ప్రతి తరగతి గదిలో ఐఎఫ్‌టీ ప్యానళ్లు, వాటర్ ప్యూరిఫయర్లు, మంచి వంట గది, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు కల్పించారు. ఇందుకు సుమారు రూ. 1.70 కోట్లు నాడు-నేడు ద్వారా నిధులు వెచ్చించారు. నాలుగు అదనపు తరగతి గదుల్లో రెండు నిర్మాణాలు పూర్తి కాగా మరో రెండు నిర్మాణంలో ఉన్నాయి. ఐఎఫ్‌టీ ప్యానల్ ద్వారా విద్యార్థులకు సులువుగా బోధపడేలా విజువల్ ఎఫెక్ట్‌తో బోధన జరుగుతోంది. ఇందులో ప్రధానంగా లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులు బోధిస్తున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయుడు

ట్యాబ్‌లతో సబ్జెక్టులపై మరింత పట్టు..

ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లలో విద్యాబోధనకు సంబంధించిన అంశాలే లోడ్ చేసి ఉంటాయి. బైజూస్ కంటెంట్‌తో పాఠ్యాంశాలకు సంబంధించిన వీడియోలు ఇందులో పొందుపరిచారు. వీటి ద్వారా విద్యార్థులు ఆయా సబ్జెక్టులపై మరింత పట్టు పెంచుకునే అవకాశం ఉంది. అలాగే కొన్ని ఎడ్యుకేషన్ గేమ్స్ విద్యార్థుల ఐక్యూ పెరిగేలా తీర్చిదిద్దబడ్డాయి. కొంత మంది వీటిపై చేస్తున్న విమర్శల్లో ఎలాంటి నిజం లేదని స్వయంగా విద్యార్థులే చెబుతుండడం విశేషం. ప్రభుత్వం విద్యా వికాసానికి, విద్యార్థుల భవితకు చేపట్టిన సంస్కరణలు అద్భుతమని ఎంతో మంది కొనియాడుతున్నారు.



హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాల



ఇటీవల పాఠశాలకు వచ్చిన వాటర్ ప్యూరిఫయర్లు

మా స్కూల్ చాలా బాగుంది



మా స్కూల్ చాలా బాగుంది. ఈ ఏడాదే ఇక్కడ చేరాను. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయి. మాకు ట్యాబులు ఇచ్చారు. వీటి ద్వారా బాగా చదువుకోగలుగుతున్నాం. ఉపాధ్యాయులు కూడా ఎంతో బాగా పాఠాలు చెబుతున్నారు.

– కె. ప్రవల్లిక, 8వ తరగతి, హెచ్‌సీ వెంకటాపురం పాఠశాల

మా స్కూల్లో ఎంతో మార్పొచ్చింది



మా స్కూల్లో ఎంతో మార్పు వచ్చింది. ఇప్పుడు చాలా బాగుంది. నాడు-నేడు పనులు పూర్తయితే ఇంకా బాగుంటుంది. బెంచీలు, ఐఎఫ్‌టీ ప్యానళ్లు వచ్చాయి. వాటి ద్వారా ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు బాగా అర్థమవుతున్నాయి.

– పి. పూర్ణిమ, 8వ తరగతి, హెచ్‌సీ వెంకటాపురం పాఠశాల

ట్యాబ్స్‌లో ఇతర గేమ్స్, వీడియోలు లేవు



మా ట్యాబ్‌లలో ఎడ్యుకేషన్ గేమ్స్ మాత్రమే ఉన్నాయి. అవి లోడెడ్ గేమ్స్ మాత్రమే. ఆన్‌లైన్ గేమ్స్ ఆడేందుకు ఇందులో అవకాశం లేదు. పాఠ్యాంశాలు, బైజూస్ వంటివి మాత్రమే ఉన్నాయి. టీచర్లు ఎప్పటికప్పుడు వీటిని పరిశీలిస్తున్నారు.

– కె. గౌతం శ్రీకృష్ణ, 8వ తరగతి, హెచ్‌సీ వెంకటాపురం పాఠశాల

ఐఎఫ్‌టీ ప్యానల్ చక్కగా ఉపయోగపడుతోంది



విద్యా బోధనకు ఐఎఫ్‌టీ ప్యానల్ చాలా ఉపయోగపడుతోంది. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేందుకు వారి చేత ప్యానల్‌పై వర్క్ చేయిస్తున్నాం. ట్యాబ్‌ల వల్ల కూడా విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతోంది. సీఎం జగన్ చేసిన విద్యా సంస్కరణలు చాలా బాగున్నాయి.

– ఎస్.అప్పలనాయుడు, గణిత ఉపాధ్యాయుడు

గతంలో కంటే మా పాఠశాల మెరుగుపడింది



గతంలో కంటే మా పాఠశాల చాలా మెరుగుపడింది. విద్యార్థుల్లో మార్పు సాధించాం. స్కూల్ కమిటీ కూడా సహకరించింది. ఇటీవలే ఐఎఫ్‌టీ ప్యానళ్లు, రెండు వాటర్ ప్యూరిఫయర్లు వచ్చాయి. వచ్చే ఏడాదిలో చక్కటి ప్రగతి సాధిస్తాం.

– కామేశ్వరరావు, హెచ్‌ఎం, హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాల

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయ సన్నిధానంలో గోపూజ చేస్తున్న దృశ్యం

మల్కాపురం : జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెంలో గల కనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించారు. శ్రీకృష్ణ యాదవ సంఘం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్, విశాఖ డెయిరీ బోర్డు డైరెక్టర్ పిల్లా రమాకుమారి, వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు, గోవులకు కనుల పండువగా పూజలు జరిగాయి. మహిళలు కలశాలు తలపై పెట్టుకుని గాజువాక డిపో నుంచి మందిరం వరకు ఊరేగింపుగా వచ్చారు. పసుపు, కుంకుమలతో అమ్మవారిని అభిషేకించారు. కమిటీ ప్రతినిధులు కిలాడి పైడిరాజు యాదవ్, ఉరుకూటి బంగార్రాజు యాదవ్, నక్క లక్ష్మణరావు యాదవ్, దాకరపు నూకరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీమియర్ లీగ్ టోర్నీ విజేత స్టీల్ టైటాన్స్



స్టీల్ టైటాన్స్ జట్టుకు షీల్డు అందజేస్తున్న అతిథులు

ఉక్కునగరం: ఉక్కు ఎంప్లాయీస్ ప్రీమియం లీగ్ టోర్నమెంట్‌లో స్టీల్ టైటాన్స్ జట్టు విజేతగా నిలిచింది. స్థానిక ఉక్కు స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో స్టీల్ వారియర్స్, స్టీల్ టైటాన్స్, స్టీల్ ఎవెంజర్స్, ఉక్కు రాయల్స్, ఉక్కు సూపర్ గ్రీన్ జట్లు పాల్గొన్నాయి. 11 రోజుల పాటు జరిగిన టీ 20 క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. స్టీల్ టైటాన్స్, ఉక్కు రాయల్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో స్టీల్ టైటాన్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన రాయల్స్ జట్టు 19 ఓవర్లలో 143 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన స్టీల్ టైటాన్స్ జట్టు 18.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి, లక్ష్యాన్ని ఛేదించింది. టైటాన్స్ జట్టుకు చెందిన బ్యాట్స్‌మన్ యు. రమేష్ 50 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, కోక్‌ఓవెన్స్ జీఎం ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్, ఏసీఎస్ విభాగం జీఎం వి. చిట్టిబాబు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెంటార్ ఇ. వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణ.. అందరి బాధ్యత



1,095వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని, దానిని కాపాడుకునేందుకు తెలుగువారంతా పోరాటానికి సిద్ధం కావాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారానికి 1095వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే స్టీల్‌ప్లాంట్ అంశంలో సానుకూల స్పందన లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలన వల్ల దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారని ఆరోపించారు. లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం దేశంలోని నిరుద్యోగులను మోసం చేస్తోందని, కార్మికులకు పనిలేకుండా చేస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఎంతటి త్యాగానికైన సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు

అవగాహనతోనే పిల్లల్లో క్యాన్సర్ మరణాల నివారణ



డాక్టర్లతో క్యాన్సర్‌ను జయించిన చిన్నారులు

ఎంవీపీకాలనీ: అవగాహన, ముందస్తు గుర్తింపుతోనే పిల్లల్లో క్యాన్సర్ మరణాల నివారణ సాధ్యమవుతందని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. ప్రపంచ బాలల క్యాన్సర్ నివారణ డే సందర్భంగా ఎంవీపీ కాలనీలోని మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, శ్రేయ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏటా 0 నుంచి 19 ఏళ్ల వయసు గల 4 లక్షల మంది చిన్నారులు క్యాన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. పిల్లల్లో క్యాన్సర్ ముందస్తు నిర్ధారణ అత్యంత కీలకమన్నారు. ముందస్తు నిర్ధారణతో వారికి ప్రాణహాని లేకుండా చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్‌పై అవగాహన పెంచే దిశగా మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కృషి చేస్తున్నట్టు తెలిపారు.

కేజీహెచ్ పీడియాట్రిక్స్ విభాగ హెచ్‌వోడీ డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి మాట్లాడుతూ ఇతరులకు అవగాహన పెంచే విధంగా క్యాన్సర్‌ను జయించిన చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలిస్టాలిన్ చౌదరి, డాక్టర్ వి.ప్రవీణ, డాక్టర్ వై.రజనీ, డాక్టర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య దేవుడికి పూజలు



సూర్యనారాయణ స్వామి

సింహాచలం: మాఘ మాసంలో తొలి ఆదివారంను పురస్కరించుకుని సింహాచలం దేవస్థానంకి చెందిన శ్రీకృష్ణాపురం గోశాల సమీపంలోని సప్త అశ్వవాహన సమేత సూర్యానారాయణ స్వామిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సూర్య నమస్కారాలు చేశారు. ఆదిత్య పఠన పారాయణ చేశారు.

సృజనాత్మకంగా స్టోరీ టెల్లింగ్



ఆర్ట్‌స్కేపింగ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సీతమ్మధార: విశాఖ పబ్లిక్ లైబ్రరీ, భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆర్ట్ స్కేపింగ్(బొమ్మలు గీసి వాటి ద్వారా కథను వివరించడం) కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 5వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కథకురాలు సీతాశ్రీనివాస్ 'అప్పలాచియన్' జానపద కథను ఆర్ట్‌స్కేపింగ్ ద్వారా విద్యార్థులకు వివరించారు. జానపద కథలను విన్నూత రీతిలో సృజనాత్మకంగా ఆమె ఆవిష్కరించారు. విద్యార్థులతో బొమ్మలు గీయించి, వాటి ద్వారా కథలో లీనమయ్యేలా చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింహాచలేశునికి స్వర్ణ సంపెంగలతో అర్చన



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. అందులో భాగంగా స్వామివారికి ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన చేశారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.2.12 లక్షల విరాళం





దాతలకు బాండ్ అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సింహాచలం దరి ప్రహ్లాదపురం ప్రాంతానికి చెందిన పిల్లా భాస్కరరావు దంపతులు రూ.1,01,116లు, మర్రిపాలెం ప్రాంతానికి చెందిన ఎం.సీతాపతిరావు రూ.1,11,111లు విరాళంగా అందజేశారు. సింహగిరికి కుటుంబ సమేతంగా వచ్చిన దాతలు సంబంధిత విరాళాలను నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు అన్నప్రసాదం పథకం ఏఈవో పాలూరి నరసింగరావు బాండ్‌లు అందజేశారు.

వీర పరాక్రమ ధీరుడు హనుమంతుడు

సామవేదం షణ్ముఖ శర్మ



సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

ఎంవీపీకాలనీ: సామవేదం షణ్ముఖ శర్మ హనుమద్వైభవ ప్రవచనాలు ఎంవీపీ కాలనీలో ఆదివారం కొనసాగాయి. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా షణ్ముఖ శర్మ హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనాలు నాలుగు రోజులుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ మహావీర, పరాక్రమ, ధీరుడు హనుమంతుడు అని చెప్పారు. శ్రీ తులసీదాస్ మానవాళికి అందించిన హనుమాన్ చాలీసా జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ ఒడిసి పట్టుకోడంతో పాటు పిల్లలకు తెలియజెప్పాలన్నారు. దీని ద్వారా మానసిక స్థైర్యం లభిస్తుందని చెప్పారు. ప్రవచనాలతో పాటు ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రవచనాలు అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు.

వైభవోపేతంగా శ్రీనివాస కల్యాణోత్సవం



టీపీటీ కాలనీలో శ్రీనివాసుడికి తిరువీధి నిర్వహిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

సీతమ్మధార: స్థానిక టీపీటీ కాలనీలోని ద్రావిడ సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో శృతిలయ ఆధ్యాత్మిక భక్తి సంకీర్తన సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస కల్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం వైఖానస ఆగమ సంప్రదాయంలో రంగనాథ ఆచార్యులు బృందంచే భక్తజనుల గోవింద నామస్మరణల మధ్య అంగరంగా వైభవంగా కల్యాణం జరిగింది. శృతిలయ బృందం గాయనీగాయకులు కల్యాణోత్సవంలోని మధుర ఘట్టాల సన్నివేశాలకు అనుగుణంగా అన్నమాచార్య సంకీర్తనలను మధురంగా ఆలపించారు. తిరువీధి మహోత్సవం సంప్రదాయ రీతిలో జరిగింది. తిరుమల దేవస్థానానికి చెందిన ఆధ్యాత్మిక వ్యాఖ్యాత శ్రీమాన్ అక్కెళ్ల విభీషణ శర్మ స్వామి, అమ్మవార్లకు దివ్య మంగళ హారతి ఇచ్చి కొబ్బరికాయకొట్టి తిరువీధిని ప్రారంభించారు. కె.ఎ.రాజు, ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, వంకాయల సన్యాసిరాజు, డాక్టర్ ఎన్ఏఎన్ మూర్తి, ఏపీఎస్ మూర్తి, భక్తులు పాల్గొన్నారు.